సాక్షి రాజన్న సిరిసిల్ల

ఆదివారం । 29 । అక్టోబర్ । 2023

అమరులయాదిలో..



సిరిసిల్లక్రైం/సిరిసిల్లఅర్బన్: పోలీసు అమర వీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా జిల్లాలోని బెటాలియన్ పోలీసులు శనివారం బైక్‌ర్యాలీ నిర్వహించారు. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాణాలు అర్పించిన అమరవీరులను స్మరించుకోవాలని అధికారులు పేర్కొన్నారు. సర్దాపూర్‌లోని 17వ బెటాలియన్ క్యాంపు నుంచి సిరిసిల్ల వరకు బైక్ ర్యాలీ సాగింది. అసిస్టెంట్ కమాండెంట్ కె.జయప్రకాశ్ నారాయణ, ఎం.పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

విద్యార్థులు పరిశోధనలపై జిజ్ఞాస పెంచుకోవాలి



మాట్లాడుతున్న సతీశ్‌కుమార్

వేములవాడఅర్బన్: సమాజం ఎదుర్కొంటున్న వివిధ సమస్యలకు పరిష్కారం చూపేందుకు విద్యార్థులు పరిశోధనలపై జిజ్ఞాస పెంచుకోవాలని కరీంనగర్ ఎస్సారార్ కాలేజీ సీనియర్ సహాయ ఆచార్యులు అనంతుల సతీశ్‌కుమార్ కోరారు. వేములవాడ మండలం అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల జిజ్ఞాస, పరిశోధన కమిటీల సంయుక్తంగా శనివారం ఏర్పాటు చేసిన జిజ్ఞాస స్టూడెంట్ స్టడీ ప్రాజెక్టుల అవగాహన వర్క్‌షాప్‌లో మాట్లాడారు. కాలేజీ ప్రిన్సిపాల్ శ్రీనివాస్ మాట్లాడుతూ గతేడాది కాలేజీ నుంచి రాష్ట్రస్థాయికి 7 ప్రాజెక్టులు ఎంపికవగా.. కామర్స్ ప్రాజెక్టుకు ప్రథమ బహుమతి వచ్చిందని తెలిపారు. ఆ స్ఫూర్తితోనే ఈ ఏడాది కూడా ప్రాజెక్టులు రూపొందించాలని కోరారు. వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, జిజ్ఞాస సమన్వయకర్త మల్లారెడ్డి, అధ్యాపకులు రమాదేవి, ప్రభాకర్, రాజేశ్, శ్రీనివాసులు, కరుణ, అంజద్ ఉన్నారు.

'దుద్దిళ్ల'కు మాజీ సర్పంచుల వినతి



శ్రీధర్‌బాబుకు విన్నవిస్తున్న మాజీ సర్పంచులు

సిరిసిల్లటౌన్: మాజీ సర్పంచులు శనివారం టీపీసీసీ మేనిఫెస్టో కమిటీ అధ్యక్షుడు దుద్దిళ్ల శ్రీధర్‌బాబును కలిశారు. తమ డిమాండ్లను పార్టీ మేనిఫెస్టోలో పెట్టాలని కోరారు. మాజీ సర్పంచుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు బొడ్డు దేవయ్య మాట్లాడుతూ మాజీ సర్పంచులకు నెలకు రూ.10వేల పింఛన్, హెల్త్‌కార్డులు అందించాలని, పిల్లలకు ఉచిత విద్య సౌకర్యం కల్పించాలని కోరారు. భూమన్న, ఏరెడ్డి మల్లారెడ్డి, మల్లేశ్‌గౌడ్, బుర్ర మల్లేశంగౌడ్, గుర్రం భూపతిరెడ్డి, మచ్చ నారాయణ తదితరులు ఉన్నారు. మాజీ సర్పంచుల వినతిపై దుద్దిళ్ల శ్రీధర్‌బాబు స్పందించి మేనిఫెస్టోలో చేర్చడానికి కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.

బతుకమ్మ చీరలతో కార్మికులకు ఒరిగిందేమీ లేదు



మాట్లాడుతున్న కొండ ప్రతాప్


సిరిసిల్లటౌన్: రాష్ట్ర ప్రభుత్వం గొప్పగా చెప్పుకుంటున్న బతుకమ్మ చీరలతో సిరిసిల్ల నేతకార్మికులకు ఒరిగిందేమీ లేదని పద్మశాలి సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కొండ ప్రతాప్ ఆరోపించారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శనివారం విలేకరులతో మాట్లాడారు. బతుకమ్మ చీరల ఆర్డర్లతో బీఆర్‌ఎస్‌కు కొమ్ముకాసే కొంతమంది సేట్లు, ఆసాములకే లబ్ధి చేకూరిందని ఆరోపించారు. గతంలో సిరిసిల్ల సాంచాలపై కాటన్, పాలిస్టర్ వస్త్రోత్పత్తి నిరంతరం నడిచేవన్నారు. ప్రస్తుతం కొందరు ఆసాములు తమ సాంచాలను అమ్ముకునే స్థితిని ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యారన్‌డిపో, వర్కర్ టు ఓనర్ పథకం హామీలు అటకెక్కాయని ఎద్దేవా చేశారు. స్థానిక పద్మశాలీలనే ఎమ్మెల్యేగా ఎన్నుకుంటేనే నేత కార్మికులు, పద్మశాలీల బతుకులు బాగుపడతాయన్నారు. రవీందర్, వల్లకట్ల భూమేశ్, పర్శ రాములు, సబ్బని బాలయ్య, బోలి వీరేశం, వీరస్వామి, రాజమల్లు పాల్గొన్నారు.

కార్మికులను విస్మరిస్తున్న పార్టీలు



మాట్లాడుతున్న ఎగమంటి ఎల్లారెడ్డి

సిరిసిల్లటౌన్: హమాలి కార్మికుల సంక్షేమాన్ని రాజకీయ పార్టీలు విస్మరించాయని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడ్డి విమర్శించారు. జిల్లా కేంద్రంలో శనివారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. రాబోయే ఎన్నికల్లో హమాలి కార్మికుల సంక్షేమానికి స్పష్టతనిచ్చిన పార్టీకే కార్మికుల మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. ఇప్పటి వరకు కార్మికుల సంక్షేమంపై ఏ పార్టీ స్పందించకపోవడం శోచనీయమన్నారు. పెరుమాండ్ల వేణు, రేగుల నర్సయ్య, లక్ష్మీనర్సు, రాజు, శంకర్, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.



గుడ్లగూబ పగలు చూడలేదు..
కాకి రాత్రిని చూడలేదు..
ఓటును అమ్ముకునే ప్రజలు ప్రగతిని, ప్రజాస్వామ్యాన్ని చూడలేరు.
– డాక్టర్ అబ్దుల్ కలామ్

మీకు తెలుసా?

ఈవీఎంలకు 41ఏళ్లు

కరీంనగర్ అర్బన్: ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్(ఈవీఎం)లు వినియోగంలోకి వచ్చి 39ఏళ్లు పూర్తయ్యాయి. ఎన్నికల్లో బ్యాలెట్ పత్రాలకు ప్రత్యామ్నాయంగా 1982లో ఈ యంత్రాలను అందుబాటులోకి తీసుకువచ్చారు. మొదట్లో వీటి వాడకానికి కేంద్ర ఎన్నికల సంఘం ససేమిరా అన్నప్పటికీ అనంతర కాలంలో ఓకే చెప్పింది. మొదటిసారి 1982 మే 19న జరిగిన కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా పరోగ్ నియోజకవర్గంలో ఈవీఎంలను వినియోగించారు. అనంతరం దేశవ్యాప్తంగా 1982–83 సంవత్సరాల్లో 10 నియోజకవర్గాల్లో జరిగిన ఉపఎన్నికల్లో వినియోగించారు. వీటిని వినియోగించవద్దని 1984 మే 5న సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. సాంకేతికంగా మార్పులు చేసి 1988 డిసెంబర్‌లో సెక్షన్ 61 ద్వారా కేంద్రం ప్రజాప్రాతినిథ్య చట్టంలో చేర్చింది. ఆ తరువాత సెక్షన్ 61ఏ సవరణలను 1989 మార్చి 17న ప్రజాప్రాతినిథ్యం చట్టం అమలులోకి తెచ్చింది. దీన్ని సుప్రీంకోర్టు సమర్థించడంతో ఈవీఎంల వాడకం మళ్లీ ప్రారంభమైంది. 1990 జనవరిలో ఎన్నికల సంస్కరణల కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అదే ఏడాది ఏప్రిల్‌లో ఈవీఎంల వాడకాన్ని సాంకేతిక నిపుణుల కమిటీ సమర్థించింది. ఈవీఎంల వాడకానికి 1998లో ప్రజా ఆమోదం లభించింది. వివిధ రాష్ట్రాల్లో 1999, 2004లో జరిగిన ఎన్నికల్లో ఈవీఎంలను వినియోగించారు. లోక్‌సభకు 2004, 2014 మధ్య జరిగిన మూడు ఎన్నికల్లో వీటినే వాడారు. వీవీప్యాట్లను వాడాలని వినియోగించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. దశల వారీగా 2013 నుంచి వీవీ ప్యాట్లు వినియోగిస్తున్నారు.







వేంకటేశ్వరస్వామి రథోత్సవంలో పాల్గొన్న భక్తజనం

వైభవోపేతం వెంకన్న రథోత్సవం

- మాడవీధుల్లో మార్మోగిన గోవింద నామస్మరణ
- సిరిసిల్ల జాతరలో పోటెత్తిన భక్తజనం

సిరిసిల్లటౌన్: 'గోవిందా.. గోవిందా..' నామస్మరణతో సిరిసిల్లలోని మాఢవీధులు మార్మోగాయి. బ్రహ్మాండనాయకుని బ్రహ్మోత్సవానికి అశేష భక్తజనం తరలివచ్చారు. సిరిసిల్ల వెంకన్న రథోత్సవం శనివారం వైభవోపేతంగా సాగింది. భక్తుల కోలాటాలు, భజన సంకీర్తనలతో రథయాత్ర శోభాయమానంగా సాగిపోయింది. శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి వారు రథంపై ఉదయం 4 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు దర్శనమిచ్చారు. జిల్లాకేంద్రంతోపాటు పరిసర గ్రామాల నుంచి సుమారు లక్షమందికి పైగా భక్తులు దర్శించుకున్నారు. చంద్రగ్రహణం ప్రభావంతో సాయంత్రం జరగాల్సిన రథయాత్ర మధ్యాహ్నం నిర్వహించి సాయంత్రం 5 గంటలకు ఆలయాన్ని మూసివేశారు.

స్వామి సేవలో ప్రముఖులు

రథోత్సవం సందర్భంగా స్వామిని జిల్లా జడ్జి ప్రేమలత, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, టీఎస్‌పీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, మున్సిపల్ వైస్‌చైర్మన్ మంచె శ్రీనివాస్, ఆర్‌బీఎస్ జిల్లా అధ్యక్షుడు గడ్డం నర్సయ్య, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్, రీజినల్ ఇన్‌స్పెక్టర్ పి.సత్యనారాయణ, ఆలయ ప్రధానార్చకులు మాడం రాజు, కృష్ణమాచారి, ఈవో మారుతిరావు, ఏఈవోలు రవీందర్, ప్రభాకర్, ఆలయ కమిటీ మాజీ చైర్మన్లు ఉప్పుల విఠల్‌రెడ్డి, చేపూరి నాగరాజు, తీగల శేఖర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



స్వామివారిని దర్శించుకుంటున్న జిల్లా జడ్జి ప్రేమలత



రథోత్సవంలో పాల్గొన్న సిరిసిల్ల బీఆర్‌ఎస్ నాయకులు

అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా

- బీఆర్‌ఎస్ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావు



చందుర్తిలో మాట్లాడుతున్న లక్ష్మీనరసింహారావు

చందుర్తి(వేములవాడ): ఎమ్మెల్యేగా గెలిపిస్తే వేములవాడ నియోజకవర్గాన్ని ఐదేళ్లలో అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని బీఆర్‌ఎస్ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావు పేర్కొన్నారు. చందుర్తిలోని పెరుక, మున్నూరుకాపు, ముదిరాజ్ కులసంఘాల్లో లక్ష్మీనరసింహారావు శనివారం ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులతోపాటు బీసీ బంధు, దళితబంధు అమలుచేసి అన్నివర్గాలకు అండగా నిలిచి బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని ప్రజలు ఆదరించాలని కోరారు. సెస్ డైరెక్టర్ పొన్నాల శ్రీనివాస్‌రావు, చందుర్తి సింగిల్‌విండో అధ్యక్షుడు తిప్పని శ్రీనివాస్, మండల కోఆప్షన్ సభ్యులు బత్తుల కమలాకర్, రుద్రంగి మార్కెట్ కమిటీ అధ్యక్షుడు ఏనుగుల శ్రీనివాస్, రుద్రంగి మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షుడు దప్పుల అశోక్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ లింగాల మల్లయ్య పాల్గొన్నారు.

మీ బిడ్డగా దీవించండి

- డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్



కోనాయపల్లిలో మాట్లాడుతున్న ఆది శ్రీనివాస్

వేములవాడరూరల్: ఎన్నికల సమయంలో ఓట్ల కోసం మీ వద్దకు రాలేదని.. నాలుగుసార్లు ఓడినా మీలో ఒకడిగా మీ మధ్యనే ఉంటున్నానని.. ఒక్కసారి తనకు ఓటు వేసి గెలిపించాలని డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ కోరారు. వేములవాడ మున్సిపల్ పరిధిలోని కోనాయపల్లిలో శనివారం ఎల్లమ్మ ఆలయం వద్ద గౌడకులస్తులను కలిసి ఓటు వేయాలని, ఒక్కసారి అవకాశం ఇవ్వాలని కోరారు. మద్దతుగా నిలిచి ఓట్లు వేస్తామని గౌడకులస్తులు హామీ ఇచ్చారు. కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు చంద్రగిరి శ్రీనివాస్‌గౌడ్, సీనియర్ నాయకులు చిలుక రమేశ్, సాయిని అంజయ్య, కూరగాయల కొమురయ్య, కూర దేవయ్య, కనికరపు రాకేశ్, లింగంపల్లి కిరణ్, సాబీర్, వస్తాద్ కృష్ణ, నీలం గురవయ్య, షేక్ ఫిరోజ్, సాయి, తిరుపతి, ప్రకాశ్ ఉన్నారు.

అహంకార పాలనకు చరమగీతం పాడుదాం

- కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి మహేందర్‌రెడ్డి



కాంగ్రెస్‌లో చేరిన రాజీవ్‌నగర్ ప్రజలు

సిరిసిల్లటౌన్: బీఆర్‌ఎస్ అహంకార పాలనకు చరమగీతం పాడుదామని కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి కోరారు. శనివారం సిరిసిల్ల పరిధిలోని రాజీవ్‌నగర్‌కు చెందిన వారు కాంగ్రెస్‌లో చేరారు. సోనియాగాంధీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలపై ప్రజల్లో ఎంతో విశ్వాసం పెరిగిందన్నారు. రానున్న ఎన్నికల్లో తమ పార్టీ విజయం తథ్యమన్నారు. కాంగ్రెస్ పార్టీ పట్టణాధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్, చేనేత సెల్ జిల్లా అధ్యక్షుడు గోనె ఎల్లప్ప, వంగ మల్లేశం, టోని తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఆశీర్వాదంతో విజయం సాధిస్తా

- చొప్పదండి కాంగ్రెస్ అభ్యర్థి మేడిపల్లి సత్యం



కాంగ్రెస్‌లో చేరిన మహిళలతో సత్యం

బోయినపల్లి(చొప్పదండి): ప్రజల ఆశీర్వాదంతో విజయం సాధిస్తానని చొప్పదండి కాంగ్రెస్ అభ్యర్థి మేడిపల్లి సత్యం పేర్కొన్నారు. మండలంలోని తడగొండకు చెందిన పలువురు మహిళలు, యువకులు శనివారం కాంగ్రెస్‌లో చేరగా.. కండువాలు కప్పి ఆహ్వానించారు. అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీ పథకాలు అమలు చేస్తామన్నారు. తడగొండ గ్రామ పరిసరాల్లో పోలీసులు సత్యం వాహనాన్ని తనిఖీ చేశారు. ఎంపీటీసీ ఉయ్యాల శ్రీనివాస్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వన్నెల రమణారెడ్డి, బోయిని ఎల్లేశ్, ఏనుగుల కనకయ్య, కట్ట లచ్చయ్య, పిట్టల మోహన్, ముదాం శ్రీనివాస్ ఎండీ హుస్సేన్, సింగరి కేశవరెడ్డి, కట్ట బాబు, నాగుల వంశీ ఉన్నారు.

పక్కా ప్రణాళికతో ముందుకెళ్లాలి

- చెక్‌పోస్టులలో నిష్పక్షపాతంగా తనిఖీలు
- నామినేషన్ ప్రక్రియ సక్రమంగా జరిగేలా చర్యలు
- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్



మాట్లాడుతున్న వికాస్‌రాజ్



హాజరైన జిల్లా అధికారులు

సాక్షిప్రతినిధి, కరీంనగర్: అసెంబ్లీ ఎన్నికలు పక్కా ప్రణాళికతో పారదర్శకంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ అధికారులను ఆదేశించారు. కరీంనగర్ కలెక్టరేట్‌లో శనివారం కరీంనగర్, రాజన్నసిరిసిల్ల, జగిత్యాల, పెద్దపల్లి జిల్లాల ఎన్నికలు, పోలీస్, రిటర్నింగ్ అధికారులతో సమీక్షించారు. జిల్లాల్లో చేపట్టిన ఎన్నికల ఏర్పాట్ల గురించి పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా జిల్లా ఎన్నికల అధికారులు వివరించారు.

క్షేత్రస్థాయిలో సమీక్షించాలి

జిల్లాలోని నియోజకవర్గాల వారీగా సమస్యాత్మకమైన పోలింగ్ కేంద్రాలపై సమీక్షించాలని ఆదేశించారు. సీవిజిల్ యాప్ గురించి గ్రామీణులకు అవగాహన కల్పించాలన్నారు. సువిధ మొబైల్ యాప్, యూజర్ చార్జీల గురించి తెలియజేయాలన్నారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో వచ్చే ఫిర్యాదులపై జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

తనిఖీల్లో నిష్పక్షపాతంగా ఉండాలి

చెక్‌పోస్టులలో వాహనాల తనిఖీలు నిష్పక్షపాతంగా ఉండేలా చూడాలని వికాస్‌రాజ్ ఆదేశించారు. సామాన్యులకు ఇబ్బంది కలగకుండా పట్టుబడిన నగదు, వస్తువులపై సమీక్షించుకొని త్వరగా చర్యలు తీసుకోవాలన్నారు. చెక్‌పోస్టుల వద్ద సిబ్బంది పనితీరును సీసీకెమెరాలలో పర్యవేక్షించాలన్నారు. లైసెన్స్‌డ్ ఆయుధాలను తిరిగి స్వాధీనం చేసుకోవాలన్నారు.

పోలింగ్‌శాతంపై దృష్టిపెట్టాలి

గతంలో పోలింగ్ శాతం తక్కువ నమోదైన ప్రాంతాలపై అధికారులు దృష్టి సారించాలన్నారు. ఓటరు జాబితాలో డూప్లికేట్, డబుల్ ఓటర్లు లేకుండా చూడాలని, ఒకే ఇంటినంబర్‌పై ఎక్కువ మంది ఓటర్లు ఉంటే పరిశీలించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వికలాంగులు, 80 ఏళ్లు పైబడి పోలింగ్ కేంద్రానికి రాలేని వారికి కల్పిస్తున్న సౌకర్యాలపై అవగాహన కల్పించాలన్నారు. నియోజకవర్గ పరిధిలోని గోడౌన్లు, షాదీఖానాలు, ఫంక్షన్‌హాళ్లలో తనిఖీలు చేపట్టాలని, బ్యాంకు లావాదేవీలపై దృష్టి సారించాలని సూచించారు.

వీడియో రికార్డింగ్ చేయాలి

క్యూఆర్‌కోడ్, సరైన పత్రాలు లేకుండా బ్యాంకులు తరలించే నగదును సీజ్ చేయడంతోపాటు వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని వికాస్‌రాజ్ సూచించారు. నామినేషన్ల ప్రక్రియ మొదలు కాబోతున్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని, పటిష్ఠమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రిటర్నింగ్ అధికారి ఆఫీస్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, నామినేషన్ ప్రక్రియను వీడియో రికార్డు చేయించాలన్నారు. అదనపు డీజీ సంజయ్‌కుమార్ జైన్, డీఐజీ కె.రమేశ్‌నాయుడు, ఉమ్మడి జిల్లా ఎన్నికల అధికారులు ప్రఫుల్ దేశాయ్, యాస్మిన్ బాషా, ముజమ్మిల్ ఖాన్, భీమ్యానాయక్, రామగుండం సీపీ రెమోరాజేశ్వరి, ఎస్పీలు అఖిల్‌మహాజన్ పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్‌కు 7 వరకు గడువు

- ఫారం–12(డి) సమర్పించాలి
- కలెక్టర్ అనురాగ్ జయంతి



అనురాగ్ జయంతి, కలెక్టర్

సిరిసిల్ల: జిల్లాలో అత్యవసర సేవల్లో పనిచేసే సిబ్బంది పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోవచ్చని కలెక్టర్ అనురాగ్ జయంతి తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ కోసం ఆసక్తి గల వారు నవంబర్ 7 వరకు ఫారం–12(డి) భర్తీ చేసి నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులకు అందజేయాలని సూచించారు. కలెక్టరేట్‌లో శనివారం కలెక్టర్ అనురాగ్ జయంతి మాట్లాడారు. అత్యవసర సర్వీసులు అందించే వారికి, ఎన్నికల సంఘం ద్వారా మీడియా పాసులు ఉన్న జర్నలిస్టులకు ఈసారి పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటుహక్కు వినియోగించుకునే అవకాశం కల్పించినట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాలకు వెళ్లి ఓటు వేసేందుకు వీలుకాని వారు ముందే పోస్టల్ బ్యాలెట్ పొంది ఓటు వేయవచ్చని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న వారు సంబంధిత ఆర్వో కార్యాలయానికి వెళ్లి పోస్టల్ బ్యాలెట్ ఓటు వేయాల్సి ఉంటుందన్నారు. పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తు చేసుకున్న వారికి పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఓటు వేసే అవకాశం ఇవ్వరని స్పష్టం చేశారు. ఏమైనా సందేహాలు ఉంటే జిల్లా సంక్షేమాధికారి, జిల్లా పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారి లక్ష్మీరాజంను 9490031615లో సంప్రదించాలని తెలిపారు.

బీజేపీతో బీసీల అభివృద్ధి

- బీజేపీ ఓబీసీ కార్యాలయ కార్యదర్శి వాసు



మాట్లాడుతున్న గౌడ వాసు

సిరిసిల్లటౌన్: బీసీల అభ్యున్నతి, రాజ్యాధికార కాంక్ష తీర్చేది బీజేపీ మాత్రమేనని ఆ పార్టీ ఓబీసీ రాష్ట్ర కార్యాలయ కార్యదర్శి గౌడ వాసు పేర్కొన్నారు. సిరిసిల్లలోని పార్టీ ఆఫీసులో శనివారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో మాట్లాడారు. అమిత్‌షా బీసీ సీఎంను ఏర్పాటు చేస్తామని బహిరంగంగా ప్రకటించడం పార్టీ వెనుకబడిన తరగతుల అభ్యున్నతికి ఇస్తున్న ప్రాధాన్యతకు నిదర్శనమని పేర్కొన్నారు. గుండెల్లి వేణుగోపాల్, తడుక విజయ్, శ్రీగాధ మైసయ్య, స్వామిఖ, కాళీచరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): బీసీ ముఖ్యమంత్రిని ప్రకటించడంపై బీజేపీ ఓబీసీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. పార్టీ సిరిసిల్ల అభ్యర్థిగా స్థానిక బీసీ నేతనే ప్రకటించాలని కోరారు. బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కంచర్ల పర్శరాములు, రాష్ట్ర కార్యాలయ కార్యదర్శి గౌడ వాసు, జిల్లా ప్రధాన కార్యదర్శి గుండెల్లి వేణు, ఎల్లారెడ్డిపేట మండలాధ్యక్షుడు బొమ్మెడ స్వామి, సిరిగాధ మైసయ్య, మురళి, తిరుపతి పాల్గొన్నారు.

క్లుప్తంగా

రాణా మెట్లు ఎక్కిన అవ్వ


వృద్ధురాలిని ఆటో ఎక్కిస్తున్న పోలీసులు

వేములవాడరూరల్: కనిపెంచిన కొడుకులు అన్నం పెడతలేరంటూ ఓ తల్లి రాణా మెట్లు ఎక్కిన సంఘటన శనివారం వేములవాడరూరల్ పోలీస్‌స్టేషన్‌లో జరిగింది. మండలంలోని ఫాజుల్‌నగర్‌కు చెందిన ఓ అవ్వ మలి వయసులో బాగోగులు చూసుకోవాల్సిన కొడుకులు, కోడళ్లు పట్టించుకోవడం లేదని ఎస్‌ఐ మారుతికి మొర పెట్టుకుంది. స్పందించిన ఎస్సై కొడుకులను మందలించారు. వృద్ధాప్యంలో అవ్వకు ఆసరాగా ఉండాలని సూచించారు. అనంతరం ఆమెను ఆటోలో స్వగ్రామానికి తరలించారు.

నిర్భయంగా ఓటుహక్కు వినియోగించుకోవాలి


పోలీస్ కవాతు

రుద్రంగి(వేములవాడ): అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ప్రజల్లో దాగి ఉన్న భయాలను పోగొట్టేందుకు గ్రామాల్లో పోలీస్ కవాతు చేపడుతున్నట్లు చందుర్తి సీఐ కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. రుద్రంగి మండలంలో శనివారం పోలీస్ సిబ్బంది, కేంద్ర బలగాలతో పోలీస్ కవాతు నిర్వహించారు. కేంద్ర బాలగాల సీఐ నవీన్‌వర్మ, రుద్రంగి ఎస్సై రాజేశ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతీ పోరు రసవత్తరం

- ఏడు మండలాల ధర్మపురి
- 2009లో నియోజకవర్గ కేంద్రంగా..
- పేరు మారింది.. రాజకీయ తీరూ మారింది
- ప్రతి పోరులోనూ రసవత్తరం
- గతంలో నాలుగు నియోజకవర్గాల సమూహం
- నియోజకవర్గం ఏర్పాటు నుంచి 'కొప్పుల'కే పట్టం

పోలింగ్ కేంద్రాలు	269
మొత్తం ఓట్లు	2,24,591
పురుషులు	1,90,963
స్త్రీలు	1,14,622
ఇతరులు	6





గొల్లపల్లి: మార్పులు.. చేర్పులు.. కూర్పులు.. నాలుగు నియోజకవర్గాలు.. ఆరు మండలాల సంపూర్ణ ముఖ చిత్రం ధర్మపురి. ఒకప్పుడు మేడా రం, చొప్పదండి, జగిత్యాల, బుగ్గారం నియోజకవర్గాల్లో ఉన్న గొల్లపల్లి, పెగడపల్లి, బుగ్గారం, వెల్గటూర్, ధర్మారం, ధర్మపురి మండలాల (తాజాగా ఎండపల్లి)తో 2009లో ధర్మపురి (ఎస్సీ రిజర్వ్) నియోజకవర్గమైంది. అప్పటినుంచి ఇక్కడ అనూహ్య మార్పులు చోటుచేసుకుంటున్నాయి.


మాతంగి నర్సయ్య (ఫైల్)


న్యాలకొండ రాంకిషన్‌రావు (ఫైల్)


శికారి విశ్వనాథం (ఫైల్)


జువ్వాడి రత్నాకర్ రావు (ఫైల్)


కొప్పుల ఈశ్వర్


అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

నృసింహుడు కొలువైన ప్రాంతం..

శ్రీలక్ష్మీ నృసింహాస్వామి వెలిసిన పుణ్యక్షేత్రమైన ధర్మపురి పేరిట ఏర్పాటైన ఈ నియోజకవర్గం.. పూర్తిగా వ్యవసాయ ఆధారితం. ఏడు మండలాల్లో కలిపి 129 గ్రామాలు.. మొత్తం 2,24,591 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 1,90,963 మంది, మహిళలు 1,14,622, ఇతరులు ఆరుగురు ఉన్నారు. 63 శాతం బీసీలు, 23శాతం ఎస్సీలు, ఇతరులు 15 శాతం వరకు ఉన్నారు. పునర్విభజనకు ముందు గొల్లపల్లి మండలంలోని 8 గ్రామాలు జగిత్యాల నియోజకవర్గంలో, 17 గ్రామాలు చొప్పదండిలో, ధర్మపురి మండలం సిరికొండ గ్రామం చొప్పదండిలో.. మిగిలిన గ్రామాలు బుగ్గారం నియోజకవర్గంలో ఉండేవి. అలాగే పెగడపల్లిలోని నాలుగు గ్రామాలు జగిత్యాలలో, ఐదు గ్రామాలు, మేడారం, 17 గ్రామాలు చొప్పదండి పరిధిలో ఉండేవి. వెల్గటూర్‌లోని 19 గ్రామాలు మేడారంలో, ఐదు గ్రామాలు చొప్పదండిలో, రెండు గ్రామాలు బుగ్గారంలో ఉండేవి. ధర్మారం మండలం పూర్తిగా మేడారం నియోజకవర్గంలోనే ఉండేది.

తీర్పు విలక్షణం

- ధర్మపురి నియోజకవర్గానికి ముందు చొప్పదండి నియోజకవర్గం నుంచి 1957లో సీహెచ్.రాజేశ్వర్ రావు(పీడీఎఫ్) విజయం సాధించారు. 1962లో కాంగ్రెస్ నుంచి బండారి రాములు, 1978లో న్యాలకొండ శ్రీపతిరావు (ఐఎన్‌సీ(ఐ)), 1983లో గుర్రం మాధవరెడ్డి (స్వతంత్ర) గెలిచారు. 1985, 1986, 1994 వరకు న్యాలకొండ రాంకిషన్‌రావు (టీడీపీ) వరుసగా గెలిచి హ్యాట్రిక్ సాధించి మంత్రిగా కొనసాగారు. 1999లో కాంగ్రెస్ నుంచి కోడూరి సత్యనారాయణగౌడ్ విజయం సాధించారు. 2004లో టీడీపీ నుంచి సాన మారుతి విజయం సాధించారు. అనంతరం ఎస్సీ రిజర్వ్ అయినా 2009లో సుద్దాల దేవయ్య (టీడీపీ) నుంచి గెలిచారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కావడంతో ఉద్యమంలో పాలుపంచుకున్న 2014లో బొడిగె శోభ (టీఆర్‌ఎస్) నుంచి విజయం సాధించారు.
- ధర్మపురి నియోజకవర్గానికి ముందు బుగ్గారం (జనరల్) నియోజకవర్గంలోనూ కొన్ని మండలాలు ఉండేవి. అప్పటి ఓటరు తీర్పు సపరేట్ అన్నట్లు సాగింది. 1957 నుంచి 2004 వరకు అభ్యర్థి ఏ పార్టీకి చెందినా.. చివరకు స్వతంత్రంగా పోటీ చేసినా నియోజకవర్గ అభివృద్ధిని ఆశించినవారినే గెలిపించారు. 1957లో జరిగిన ఎన్నికల్లో బద్దం ఎల్లారెడ్డి (స్వతంత్ర), 1962లో ఏనుగు నారాయణ రెడ్డి (స్వతంత్ర), 1972లో జోగిని దామోదర్‌రావు (స్వతంత్ర)కు పట్టంగట్టారు. 1978లో అంబల్ల రాజారాం(కాంగ్రెస్), 1983లో కడకుంట్ల గంగారాం (కాంగ్రెస్), 1985లో ఉప ఎన్నిక సమయంలో శికారి విశ్వనాథం(టీడీపీ)కి పట్టం కట్టారు. తిరిగి 1989లో జువ్వాడి రత్నాకర్‌రావు (స్వతంత్ర)ను గెలిపించారు. మళ్లీ 1994లో శికారి విశ్వనాథం(టీడీపీ)కి పట్టంగట్టారు. అనంతరం 1999, 2004లో జరిగిన ఎన్నికల్లో జువ్వాడి (కాంగ్రెస్)ను గెలిపించారు.

2009 నుంచి బీఆర్‌ఎస్‌కు కంచుకోట

2009లో ధర్మపురిగా ఆవిర్భవించినప్పటి నుంచి ఈ నియోజకవర్గప్రజలు ఒకే అభ్యర్థికి పట్టంగడుతూ వస్తున్నారు. 2009 నుంచి ఇప్పటివరకు 2009, (2010లో ఉప ఎన్నిక) 2014, 2018లో ఎన్నికలు జరగగా.. ఉద్యమ నాయకుడు కొప్పుల ఈశ్వర్‌ను గెలిపిస్తూ వస్తున్నారు. 2018లో గెలిచిన అనంతరం మంత్రిగా కొనసాగుతున్నారు. ప్రతిసారీ ప్రధాన పోటీదారుగా కాంగ్రెస్ నుంచి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ (రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్, కరీంనగర్ జెడ్పీ చైర్మన్‌గా పనిచేసిన) ఉన్నారు. ఈ సారి జరిగే ఎన్నికల్లోనూ ఇద్దరిమధ్యే పోటీ ఉండనుంది. తను చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలే ఐదోసారి కూడా గెలిపిస్తాయని మంత్రి, బీఆర్‌ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ ధీమా వ్యక్తం చేస్తుండగా.. ఈ సారి అటు సానుభూతి, ఇటు ప్రభుత్వ వ్యతిరేకత తనను గెలిపిస్తుందని కాంగ్రెస్ అభ్యర్థి లక్ష్మణ్‌కుమార్ అంటున్నారు.

ఎస్సీ వర్గీకరణతోనే భవిష్యత్


మాట్లాడుతున్న నాయకులు

సిరిసిల్లఅర్బన్: ఎస్సీ వర్గీకరణతోనే మాదిగ ఉపకులాల భవిష్యత్ బాగుపడుతుందని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి ఆవునూరి ప్రభాకర్, ఖానాపురం లక్ష్మణ్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో శనివారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణతోనే మాదిగ ఉపకులాలకు న్యాయం జరుగుతుందన్నారు. నవంబర్ 3న ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు సిరిసిల్లకు వస్తున్నారని, ఈ సన్నాహక సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈమేరకు పోస్టర్ ఆవిష్కరించారు. వెంకటస్వామి, రాకేశ్, లచ్చన్న, శ్రీనివాస్, మధు ఉన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు సీజ్


ఇసుక ట్రాక్టర్ సీజ్ చేసిన ఎస్సై సుధాకర్

తంగళ్లపల్లి(సిరిసిల్ల): ఇల్లంతకుంట మండల వ్యాప్తంగా ఎక్కడ అక్రమంగా ఇసుకను రవాణా చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై సుధాకర్ హెచ్చరించారు. మండలంలోని పొత్తూరు, తప్పాపూర్ వాగు నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. ట్రాక్టర్ యజమానులు తోడేటి సతీశ్, బత్తిని శ్రవణ్‌లపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. పోలీస్ సిబ్బంది సత్యానారాయణ, భూమయ్య, శ్రీనివాస్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

బైక్ అదుపుతప్పి ఒకరి మృతి

వేములవాడరూరల్: మున్సిపాలిటీ పరిధిలోని కోనాయపల్లి వద్ద బైక్ అదుపుతప్పి ఒకరు మృతి చెందినట్లు పట్టణ సీఐ కరుణాకర్ తెలిపారు. ఉత్తర ప్రదేశ్‌కు చెందిన గయాసొద్దీన్(22), అనీశ్ అతివేగంగా వెళ్లి అదుపుతప్పి చెట్టును ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో గయాసొద్దీన్ తీవ్రంగా గాయపడి మృతిచెందాడు. మృతుడి తమ్ముడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

షార్ట్‌సర్క్యూట్‌తో ఆస్తినష్టం

- బాధితులను ఆదుకుంటామన్న రవిశంకర్, మేడిపెల్లి సత్యం


బాధితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవిశంకర్


వివరాలు తెలుసుకుంటున్న మేడిపెల్లి సత్యం

బోయినపల్లి(చొప్పదండి): అద్దె ఇంట్లో ఉంటున్న ఓ కూలీ కుటుంబం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో రోడ్డున పడింది. మండలంలోని నర్సింగాపూర్‌కు చెందిన రేగుల సాయిలు ఇంట్లో శనివారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగింది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాలు. కరీంనగర్‌లో నివసించే నర్సింగాపూర్‌కు చెందిన లక్ష్మి ఇంట్లో సాయిలు అద్దెకు ఉంటున్నాడు. సాయిలు కూలి పనిచేస్తుంటాడు. సాయిలు శనివారం ఉదయం కూలి పనికి, అతని భార్య మమత వ్యవసాయ పనికి వెళ్లింది. పిల్లలు సైతం ఇంట్లో లేరు. అదే సమయంలో షార్ట్ సర్క్యూట్ కావడంతో పెద్ద ఎత్తున మంటలు లేచాయి. గ్రామస్తులు మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. ఇంటి నిర్మాణానికి తెచ్చుకున్న రూ.3 లక్షల నగదు, అరతులం బంగారం కాలిపోయినట్లు బాధితుడు సాయిలు పోలీసులకు తెలిపాడు. వంట సామగ్రి, టీవీ, కూలర్, బట్టలు కాలిబూడిదయ్యాయి. రేగుల సాయిలు కుటుంబాన్ని చొప్పదండి కాంగ్రెస్ అభ్యర్థి మేడిపల్లి సత్యం పరామర్శించి, రూ.5వేలు ఆర్థికసాయం అందించారు.

సాయిలు కుటుంబానికి అండగా ఉంటాం

బోయినపల్లి(చొప్పదండి): విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమై పెద్ద మొత్తంలో ఆస్తి నష్టం జరిగిన రేగుల సాయిలు కుటుంబాన్ని ప్రభుత్వం తరఫున ఆదుకుంటామని చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పేర్కొన్నారు. శనివారం రాత్రి బాధిత కుటుంబాన్ని పరామర్శించి, రూ.20వేల ఆర్థిక సాయం అందించారు. సర్పంచ్ జోగినిపల్లి ప్రేమ్‌సాగర్‌రావు రూ.10వేలు, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు జోగినిపల్లి అజిత్‌రావు రూ.10 వేలు అందించారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒకరికి గాయాలు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని గొల్లపల్లి శివారులో శనివారం గుర్తు తెలియని వాహనం ఢీకొని వీర్నపల్లి మండలం రంగంపేటకు చెందిన గుగులోత్ దేవ్‌సింగ్ తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుడి సోదరుడు రాజు ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై రమాకాంత్ తెలిపారు. వ్యక్తిగత పనిమీద వచ్చి తన ద్విచక్రవాహనంపై తిరిగి వెళ్తుండగా గొల్లపల్లి శివారులో వెనుక నుంచి వచ్చిన వాహనం ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడ్డ దేవ్‌సింగ్‌ను ఎల్లారెడ్డిపేటలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

ఎలుగుబంటి దాడిలో ఒకరికి తీవ్ర గాయాలు



ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని గుంటపల్లిచెరువుతండాకు చెందిన గుగులోతు రవి శనివారం ఎలుగుబంటి దాడిలో తీవ్రంగా గాయపడ్డాడు. తన గొర్రెలను మేతకు అడవికి తీసుకెళ్లగా.. అక్కడే పిల్లలను పెట్టిన ఎలుగుబంటి ఉండడాన్ని గమనించకపోవడంతో వెంబడించింది. భయాందోళన చెందిన రవి వెంటనే అక్కడే ఉన్న చెట్టు ఎక్కగా ఎలుగుబంటి సైతం చెట్టు ఎక్కి రవిపై దాడి చేసింది. అదే సమయంలో తన వద్ద ఉన్న టవల్‌ను కింద పరేశాడు. టవల్‌ను ఎలుగుబంటి ముక్కలుగా చింపే క్రమంలో రవి కేకలు వేయడంతో పక్కనే ఉన్న వారు వచ్చి దాన్ని కర్రలతో అక్కడి నుంచి వెళ్లగొట్టారు. రవిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఆరోగ్యం ప్రస్తుతం నిలకడగానే ఉంది.

కారెక్కనున్న కమలం నాయకులు



ఎమ్మెల్యే రసమయితో బీజేపీ రాష్ట్ర నాయకుడు గడ్డం నాగరాజు


దరువు ఎల్లన్నను పార్టీలోకి ఆహ్వానిస్తున్న సిద్ధం వేణు

ఇల్లంతకుంటలో రాజకీయ మార్పులు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): ఇల్లంతకుంట మండలంలో రాజకీయాలు శరవేగంగా మారుతున్నాయి. కమలం పార్టీ నాయకులు కారెక్కేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. మానకొండూరు నియోజకవర్గ బీజేపీ అభ్యర్థిగా గతంలో రెండుసార్లు పోటీచేసిన గడ్డం నాగరాజు, ప్రస్తుతం టికెట్ కోసం ఆశిస్తున్న ప్రజాగాయకుడు దరువు ఎల్లన్నను పక్కనపెట్టి.. అనూహ్యంగా ఆరెపల్లి మోహన్‌ను కమలం పార్టీ అభ్యర్థిగా ఖరారు చేయడంతో ఆ పార్టీ సీనియర్ నాయకులు మండిపడుతున్నారు. శుక్రవారం వేర్వేరుగా ప్రెస్‌మీట్లు పెట్టి గడ్డం నాగరాజు, దరువు ఎల్లన్నలు తమ కార్యాచరణ ప్రకటించారు. కమలం పార్టీని విడి కారు ఎక్కనున్నట్లు చెప్పకనే చెప్పారు. తమతోపాటు తమ కార్యకర్తలు సైతం భారీ సంఖ్యలో త్వరలో గులాబీ బలగంతో కలవనున్నట్లు పేర్కొన్నారు. గడ్డం నాగరాజును ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ మర్యాదపూర్వకంగా కలిసి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానించారు. దరువు ఎల్లన్నను జెడ్పీ వైస్‌చైర్మన్ సిద్ధం వేణు, కరీంనగర్ బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు కలువగా.. ఆయన సైతం బీఆర్‌ఎస్‌కు జైకొట్టారు. త్వరలోనే మంత్రి కేటీఆర్ సమక్షంలో గులాబీ కండువా కప్పుకోనున్నారు. రానున్న రోజుల్లో ఇల్లంతకుంట మండల రాజకీయాలు మరింత రసవత్తరంగా మారనున్నట్లు తెలుస్తోంది.

బీఆర్‌ఎస్‌కు గోలి మోహన్ రాజీనామా

- బీఎస్పీలో చేరుతున్నట్లు ప్రకటన


రాజీనామాపత్రం చూపుతున్న మోహన్ గోలి

వేములవాడ: పోరాడి సాధించుకున్న తెలంగాణను దొరల చేతిలో పెట్టామని, బీఆర్‌ఎస్‌లో బీసీలకు న్యాయం దక్కడం లేదని బీఆర్‌ఎస్ అమెరికా అడ్వయిజరీ బోర్డ్ మెంబర్‌షిప్‌నకు, పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు డాక్టర్ మోహన్ గోలి ప్రకటించారు. వేములవాడలోని తన నివాసంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. త్వరలోనే బీఎస్పీలో చేరబోతున్నట్లు ప్రకటించారు. బీఆర్‌ఎస్‌లో మధ్యతరగతి కుటుంబాల ఎదుగుదలను ఓ సామాజికవర్గం ఓర్చుకోలేదన్నారు. తాను వేములవాడ నియోజకవర్గంలో ఎన్నో సేవా కార్యక్రమాలు చేశానని, యువతకు ఉద్యోగాలు ఇప్పించానన్నారు. 2001లో అప్పటి టీఆర్‌ఎస్ పార్టీ కోసం కష్టపడ్డానన్నారు. బీసీ సామాజికవర్గం కాబట్టే తనకు వేములవాడ టికెట్ ఇవ్వలేదన్నారు. కార్పొరేట్ శక్తులు వచ్చాయని, వాళ్ల కాలేజీలో ఒక్క బీసీ విద్యార్థికి ఫ్రీ సీటు ఇవ్వలేదన్నారు. 40 ఏళ్లుగా ఒకే కుటుంబం వేములవాడను పాలించిందని, మళ్లీ బీఆర్‌ఎస్ గెలిస్తే మాత్రం వినోద్‌కుమార్ కబ్జాలు చేస్తాడని ఆరోపించారు. సిరిసిల్లతో పోలిస్తే అభివృద్ధిలో వేములవాడ వెనుకబడిపోయిందని ఆవేదన వ్యక్తం చేశబూరు. వేములవాడ చుట్టూ వెలమ సామాజిక వర్గానికి భూములుంటే ఎప్పుడో అభివృద్ధి అయ్యేదన్నారు. దొరల బానిసత్వం నుంచి బయటకు రావాలని, సామాజిక మార్పు జరగాలన్నారు. ఊరు, పేరు లేని వ్యక్తిని వేములవాడ అభ్యర్థిగా పెట్టారని, వేములవాడ టికెట్ అమ్ముకున్నారని ఆరోపించారు. బీసీలు చైతన్యవంతులైతే దొరలకు ప్రమాదమని భావిస్తున్నారన్నారు. ఓటర్లు ఉచితాల నుంచి బయటకు రావాలని కోరారు.

పకడ్బందీగా తనిఖీలు


వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

సిరిసిల్లక్రైం: ఎన్నికల కోడ్ అమలులో భాగంగా జిల్లా వ్యాప్తంగా పోలీసులు పకడ్బందీగా తనిఖీలు చేపడుతున్నారు. రెండు రోజుల క్రితం వరకు చేసిన తనిఖీలను ఇంకాస్త పెంచి బీఎస్‌ఎఫ్ బలగాలు రోడ్లపై ఉండి వాహనాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. జిల్లా సరిహద్దుల్లో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల్లో ముమ్మర తనిఖీలు చేపడుతున్నారు. గత 9వ తేదీ నుంచి ఇప్పటి వరకు జిల్లాలో రూ.43.50 లక్షల నగదు సీజ్ చేసినట్లు అధికారులు వివరించారు.

చందుర్తి: మండలంలోని మర్రిగడ్డ క్రాస్‌రోడ్డు వద్ద వాహనాలను సీఐ కిరణ్‌కుమార్ శనివారం తనిఖీ చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకుండా ముందుస్తుగా ప్రతీ వాహనాన్ని సీఐ కిరణ్‌కుమార్ స్వయంగా తనిఖీ చేశారు. పోలీసులు సుమారు రెండు గంటలపాటు తనిఖీలు చేపట్టారు. ఎన్నికలు ముగిసే వరకు ప్రతి వాహనాదారుడు పోలీసులకు సహకరించాలని సీఐ కిరణ్‌కుమార్ కోరారు.

కేటీఆర్‌కు మద్దతు తెలిపిన అడ్వకేట్లు


మంత్రి కేటీఆర్‌కు మద్దతు తెలుపుతున్న సిరిసిల్ల అడ్వకేట్లు

సిరిసిల్లటౌన్: మంత్రి కేటీఆర్‌కు సిరిసిల్లకు చెందిన సీనియర్ అడ్వకేట్ తంగళ్లపల్లి వెంకట్ ఆధ్వర్యంలో న్యాయవాదులు మద్దతు తెలిపారు. ఈమేరకు శనివారం హైదరాబాద్‌లో కేటీఆర్‌ను కలిశారు. బీఆర్‌ఎస్ మళ్లీ అధికారంలోకి రాగానే న్యాయవాదుల సమస్యలను పరిష్కరిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. న్యాయవాదులు తిరుపతిరావు, మౌళి, శంకర్, బాబు, శ్రీనివాస్, సుమన్, అన్సార్ తదితరులు పాల్గొన్నారు.

ఇరువర్గాల మధ్య ఘర్షణ

వేములవాడరూరల్: మండలంలోని లింగంపల్లిలో రెండు వర్గాల మధ్య జరిగిన ఘర్షణలో నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మారుతి తెలిపారు. దుమాల అంజయ్యపై రమేశ్, తిరుపతి, దేవయ్య దాడికి పాల్పడ్డారు. బాధితుడి ఫిర్యాదుతో ముగ్గురిపై కేసు నమోదు చేశారు. అలాగే తనపై దాడి జరిగిందంటూ దుమాల రమేశ్ ఫిర్యాదుతో అంజయ్యపై కేసు నమోదు చేశారు. ఇరువర్గాలు పరస్పరం ఫిర్యాదు చేసుకోవడంతో రెండు వర్గాలపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

జిల్లా సరిహద్దులో పోలీసుల తనిఖీలు

గంభీరావుపేట(సిరిసిల్ల): రాజన్నసిరిసిల్ల, కామారెడ్డి జిల్లాల సరిహద్దు గంభీరావుపేట మండలం పెద్దమ్మ అటవీప్రాంతంలో ఏర్పాటుచేసిన చెక్‌పోస్టు వద్ద శనివారం పోలీసులు ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. ప్రధాన రహదారిపై వచ్చిపోయే వాహనాల్లో ఎస్సై మహేశ్ ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు.